ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

కాగజ్‌నగర్, నవంబర్ 4 : కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి సమస్యల పరిష్కారం వచ్చిన 28 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులు సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

సమస్యలపై వినతులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 4 : జిల్లాలో ఇప్పటి వరకు పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, వెంటనే ప్రారంభించాలని మండలంలోని పలు గ్రామాల యువకులు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన, మార్కెటింగ్ అధికారులతో మాట్లాడారు. 7 నుంచి కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు. ఇక్కడ నెల్లి రవి, జాడి విలాస్, గడ్డల ప్రణయ్, మామిడి శ్రీకాంత్, నరేష్ ఉన్నారు.

పరిహారం ఇప్పించాలి..

దహెగాం, నవంబర్ 4 : పీపీ రావు ప్రాజెక్ట్ నిర్వాసితులైన హత్తిని గ్రామస్తులు తమకు ఇండ్ల పరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. హత్తిని గ్రామానికి చెందిన 55 మంది నిర్వాసితులకు ఇండ్లకు చెందిన ఫైనల్ బిల్లు రాకపోవడంతో వారు గతంలో కోర్టును ఆశ్రయించారు. కాగా ఇటీవల(2024) కోర్టు సదరు నిర్వాసితులకు పరిహారం అందించాలని తీర్పునిచ్చింది. అయినా పరిహారం అందకపోవడంతో వినతి పత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు బండారి రాజయ్య, తాళ్లపల్లి మనోజ్‌రావు, బండారి చంద్రశేఖర్, బొల్లంపల్లి చంద్రగౌడ్, ఓరుగంటి పోచయ్య, టేకం లక్ష్మి, గువ్వల లస్మమ్మ, బండి యశోద తదితరులున్నారు.

ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషిచేయాలి

శ్రీరాంపూర్, నవంబర్ 4 : బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు శ్రీరాంపూర్ ఏరియా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషిచేయాలని జీఎం లోతు వెంకట సూర్యనారాయణ సూచించారు. జీఎం ఆఫీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు వెల్లడించారు. శ్రీరాంపూర్ ఏరియా అక్టోబర్ నెలలో 68 శాతం ఉత్పత్తి సాధించిందన్నారు. కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషిచేయాలని కోరారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఐకే ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, డీవైజీఎం అరవిందరావు, చిరంజీవులు, పీఎం కాంతారావు పాల్గొన్నారు.

ఓసీపీ సందర్శన..

శ్రీరాంపూర్ ఓసీపీని జీఎం సందర్శించారు. ఓసీపీ పీవో శ్రీనివాస్‌తో కలిసి ముందుగా ఓసీపీపై మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఓసీపీ వ్యూపాయింట్ నుంచి క్వారీని పరిశీలించారు. అలాగే ఓసీపీ క్వారీలోని పనిస్థలాలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజిరావు, ఈఈ నాగరాజు, సీనియర్ పీవో శంకర్, సర్వే ఆఫీసర్ సంపత్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు బద్రి బుచ్చయ్య పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో జీఎం (సీపీపీ) పర్యటన

ఓసీపీ పరిశీలిస్తున్న జీఎం (కార్పొరేట్ పీపీ) మనోహర్, జీఎం శ్రీనివాస్

రెబ్బెన, నవంబర్ 4 : బెల్లంపల్లి ఏరియాలో సోమవారం కార్పొరేట్ జీఎం మనోహర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) పర్యటించినట్లు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉల్లిపిట, డొర్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు పరిశీలించారు. వట్టివాగు రక్షణ కట్టతో పాటు, వెస్ట్ వ్యూ పాయింట్ ద్వారా ఖైర్‌గూడ ఓసీపీ పని స్థలాలు పరిశీలించారు. పంపుల పనితీరు, నీటి పంపింగ్‌పై అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. జీఎం ఎం శ్రీనివాస్, ఖైర్‌గూడ ఓసీపీ పీవో మచ్చగిరి నరేందర్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పీఈ వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లపై కేసు

కాగజ్‌నగర్, నవంబర్ 4 : కాగజ్‌నగర్ మండలంలోని శివపూర్ రైల్వే గేటు సమీపంలో పేకాట ఆడుతున్న శివపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, భాస్కర్, శ్రావణ్, రమేశ్, తిరుపతి, భట్టుపల్లి గ్రామానికి చెందిన సురేశ్ (భాస్కర్)పై కేసునమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మహేందర్ సోమవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఆదివారం దాడి చేసి, పట్టుకున్నట్లు స్పష్టం చేశారు. వారి నుంచి రూ.2900 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేరాలపై అవగాహన సదస్సు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 4 : జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా షీ టీమ్ ఎస్ఐ వీ హమా ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది సతీశ్, జ్యోతి, ప్రిన్సిపాల్ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

కాగజ్‌నగర్ : మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, నవంబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహించారు. సర్వేలో నిర్లక్ష్యం వహించకూడదని, ఇంటింటికీ వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించాలన్నారు. 6 నుంచి సర్వే ప్రారంభమవుతుందని, సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, శిక్షకులు భిక్షపతి, బాలకృష్ణ, రాజ్‌కుమార్, సర్వే నిర్వహించే ఉపాధ్యాయులు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

జైనూర్, నవంబర్ 4 : జైనూర్ ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆడ భీర్‌షావ్, ఎంఈవో మధూకర్, జైనూర్ జీపీ ఇన్‌చార్జి ఈవో ఆనంద్ రావ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, నవంబర్ 4 : చింతలమానేపల్లి కేజీబీవీలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంఈవో జయరాజ్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, అధికారులు అవగాహన కల్పించారు.

కౌటాల, నవంబర్ 4 : కౌటాల మండల కేంద్రంలోని రైతువేదికలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఎంఈవో హన్మంతు, డీటీ మస్కూర్ అలీ, ఎంపీవో మహేందర్, ఏపీఎం ముక్తేశ్వర్ పాల్గొన్నారు..

సిర్పూర్(టీ), నవంబర్ 4 : సిర్పూర్(టీ) మండలకేంద్రంలోని రైతువేదికలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఎంఈవో వేణుగోపాల్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్, నవంబర్ 4 : బెజ్జూర్ రైతువేదికలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు ప్రత్యేకాధికారి నదీం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో గౌరీ శంకర్, ఎంఈవో సునీత, డీటీ బిల్లా నాయక్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్ రావు, ఆర్ఐ సంతోష్ పాల్గొన్నారు

దహెగాం, నవంబర్ 4 : దహెగాం రైతు వేదికలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు తహసీల్దార్ దామెర కవిత శిక్షణ నిర్వహించారు. అనంతరం సర్వే సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, డీటీ లలిత, పీఆర్ ఏఈ ఆత్మారామ్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, నవంబర్ 4 : కెస్లాగూడ రైతు వేదికలో సర్వే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ దత్తు ప్రసాద రావు, ఎంపీడీవో మహ్మద్ అమ్జద్‌పాషా, ఎంఈవో ప్రకాశ్, అబ్జర్వర్లు, శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

వాంకిడి, నవంబర్ 4 : వాంకిడి రైతు వేదికలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు తహసీల్దార్ రియాజ్ అలీ శిక్షణ నిర్వహించారు. ఇక్కడ మాస్టర్ ట్రైనీ రాజలింగు, సుశీల్ కుమార్, హరీశ్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈవో శివ చరణ్, పీజీ హెచ్ఎంలు ప్రభోద్ కుమార్, నటరాజ, ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, కార్యదర్శులు తదితరులున్నారు.

రెబ్బెన, నవంబర్ 4 : రెబ్బెన ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ పనకంటి రామ్మోహన్‌రావు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరమ్మ, ఎంఈవో వెంకటేశ్వర్, ఎంపీవో వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను వేధిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలి

ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆమరణ నిరాహార దీక్ష

ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు

సిర్పూర్(టీ), నవంబర్ 4 : రైతులపై అటవీ అధికారులు దౌర్జన్యాలు చేస్తున్నారని, వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టీ) మండలకేంద్రంలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయం ఎదుట సోమవారం రైతులతో కలిసి సిర్పూర్(టీ) బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టీ) నియోజకవర్గంలో అటవీ అధికారులు భారీగా అవినీతికి పాల్పడుతూ రైతులపై దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల సిర్పూర్(టీ) మండలంలోని లక్ష్మీపూర్ అటవీ ప్రాంతంలో అడవి పందిని హతమార్చిన కేసులో రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సిర్పూర్(టీ) రేంజ్ అధికారి, రెబ్బెన ఎఫ్ఎస్వోలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారు చేస్తున్న అవినీతి అక్రమాలు, అడ్డగోలు పనుల్లో వారిని కాపాడుతున్న డీఎఫ్‌వోను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఆమరణ దీక్షకు సిర్పూర్(టీ) నియోజకవర్గంలోని రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

సీసీసీ నస్పూర్, నవంబర్ 4 : జాతీయస్థాయి కరాటే పోటీల్లో సీసీసీ నస్పూర్‌కు చెందిన విద్యార్థిని బోయిని శ్రీచైత్ర బంగారు పతకం సాధించిందని కరాటే మాస్టర్ పోశంపల్లి వెంకటేశ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి కరాటే టోర్నీ, ఎంపిక పోటీల్లో 35 కేజీల విభాగంలో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. పంజాబ్ రాష్ట్రం లూథియానాలో 11న నిర్వహించే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-14 కరాటే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

'కార్తీక' సందడి

దండేపల్లి : సామూహిక వ్రతంలో భక్తులు

దండేపల్లి, నవంబర్ 4 : దండేపల్లి మండలం గూడెం రమాసహిత ఆలయంలో కార్తీక మాసం తదియ పర్వదినం సందర్భంగా సోమవారం భక్తుల సందడి నెలకొంది. ముందుగా భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. స్వామివారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో 163 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించాయి.

పౌర్ణమి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం..

కార్తీక పౌర్ణమి ఉత్సవాలకు గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు-సురేఖ దంపతులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వేదపండితులు, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఈవో శ్రీనివాస్ శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సత్యదేవుని చిత్రపటాన్ని అందజేశారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన..

పౌర్ణమి జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఇబ్బందులు కలుగకుండా చూడాలని లక్సెట్టిపేట సీఐ నరేందర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆలయం వద్ద జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఘాట్ రోడ్డు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి తీరం ఎలా అనువుగా ఉంటుందో తెలుసుకున్నారు. స్వామివారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కోటి వత్తుల దీపం..

మంచిర్యాల అర్బన్, నవంబర్ 4 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ విశ్వనాథ స్వామి దేవస్థానంలో కోటి వత్తులతో కూడిన దీపాన్ని ప్రత్యేక ప్రమిదలో ఏర్పాటు చేసి భక్తులు వెలిగించారు. అంతా మంచి జరగాలని, కోరిన మొక్కులు నెరవేరాలని స్వామివారిని కోరుకుంటూ ఈ దీపాన్ని వెలిగించినట్లు వారు పేర్కొన్నారు. ఈ దీపానికి ప్రత్యేకత ఉందని, భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆలయ అర్చకులు తెలిపారు.

చెన్నూర్ టౌన్, నవంబర్ 4 : చెన్నూర్ పట్టణంలోని శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. మొదటి సోమవారం కావడంతో ఉదయమే గోదావరికి పుణ్యస్నానాలు చేశారు. అనంతరం పట్టణంలోని ఆలయాల్లో పూజలు చేసి, దీపదానం చేశారు.

దహెగాం, నవంబర్ 4 : మండలంలోని గెర్రె గ్రామస్తులు పల్లె ప్రకృతి వనంలోని ఉసరి చెట్టువద్ద సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని చేశారు. గ్రామస్తులు బ్యాండ్ మేళాలతో శోభాయాత్రగా వెళ్లి, వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

రెబ్బెన, నవంబర్ 4 : గోలేటి శ్రీ కోదండ రామాలయంలో ప్రధాన అర్చకుడు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ఆకాశదీపం పూజలు నిర్వహించినట్లు కమిటీ కార్యదర్శి శేషశయనరావు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

కెరమెరి : కానిస్టేబుల్ శంకర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కాగజ్‌నగర్, నవంబర్ 4: కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ మడావి ఆనంద్‌రావ్(38) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. రాత్రి నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో ఒక్కసారిగా మంచంపై నుంచి కింద పడి, మృతి చెందినట్లు పేర్కొన్నారు. సిర్పూర్ (యూ)లో పోలీసు లాంఛనాల ప్ర కారం కానిస్టేబుల్ అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. ఆనంద్‌కుమార్‌కు భార్య మడావి గంగామణి, ముగ్గురు కొడుకులున్నారు.

ఎమ్మెల్యే సంతాపం..

సిర్పూర్ (యూ), నవంబర్ 4 : మండల కేంద్రంలో మడావి ఆనంద్ రావ్ అంత్యక్రియలు నిర్వహించగా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని, సంతాపం ప్రకటించారు. ఆమె వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు మర్సుకోల సరస్వతి, డీఎస్పీ రామానుజం. సీఐ రమేశ్. ఎస్ఐ రామకృష్ణ. జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చై ర్మన్ ఆత్రం భగవంత్‌రావు గ్రామపటేల్, ఆత్రం ఆనందరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావ్ పాల్గొన్నారు.

కెరమెరి, నవంబర్ 4 : మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ శంకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. మర్సుకోల సరస్వతితో కలిసి కుటుంబానికి భరోసా కల్పించారు. వారి వెంట మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు పెందోర్ మోతీరాం, సయ్యద్ అబుల్ కలాం, నాయకులు తదితరులు ఉన్నారు.

జిల్లా జట్ల ఎంపిక పోటీలు

రెబ్బెన, నవంబర్ 4 : బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడమైదానంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణరెడ్డి తెలిపారు. ఎంపికైన జిల్లా జట్లు హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగే 70వ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. పురుషుల జట్టులో సిద్ధార్థ(కెప్టెన్), తిరుపతి, పవన్‌కల్యాణ్, దిలీప్‌కుమార్, నరేశ్, సాయిచరణ్, తరణ్‌సాయి, శ్రీకాంత్, శ్రీధర్, గోపాల్, దేవరాజ్, గోపాలకృష్ణ.., మహిళల జట్టులో స్వప్న, అంజలి, శ్రావణి, విష్ణుప్రియ, శ్రీ స్ఫూర్తికారుణ్య, సహస్ర, శ్రావ్య, ప్రజ్వలశ్రీ, సాయి శ్రీ వర్షిణి, శృతి ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి స్కూల్ హెచ్ఎం రవితేజ, షార్ప్‌స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు వీ మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, పీఈటీ భాస్కర్, ఆర్లరెడ్డి, సీనియర్ క్రీడాకారులు చందర్, హరిలాల్, కుమ్మరి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీ ఆధ్వర్యంలో అన్నదానం

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 4 : కాళీ మాత నవరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం విలేజ్ నంబర్ 1లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు

బెల్లంపల్లి, నవంబర్ 4 : గ్రామాల్లో గంజాయి సేవించినా, విక్రయించినా, సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ హెచ్చరించారు. మండలంలోని దుగ్నెపల్లి గ్రామంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. 25 బైకులు, ఆటోను సీజ్ చేశారు. పట్టుబడిన రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. డయల్ 100 వినియోగించే విధానం, సైబర్ క్రైమ్ మోసాలు, అరికట్టే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ ఎస్ఐ చుంచు రమేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

జైనూర్, నవంబర్ 4 : ఈఎంఆర్ఐ 108లో పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఈఎంసీ సతీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్టీ, డీఎంఎల్టీ, జీఎన్ఎం, ఏఎన్ఎం చేసిన 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ దవాఖానలోని 108 కార్యాలయంలో ఈ నెల 7న ఇంటర్వ్యూ ఉంటుందని, అభ్యర్థులు తమ నిజ ధ్రువపత్రాలతో హాజరవ్వాలని సూచించారు. వివరాలకు 91542 69804 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 4 : ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్దు డిమాండ్ చేశారు. మండల సమాఖ్య కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి, ఏపీఎం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.20 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11, 12వ తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మండల కార్యదర్శి రమ, కోశాధికారి పద్మ, వినోద్, ఫర్జానా, అర్చన, కవిత, సుధీర్, శ్రీధర్, గణేశ్, శారద, జయంత్, శంకర్ ఉన్నారు.

బెల్లంపల్లి, నవంబర్ 4 : బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఐకేపీ వీవోఏలు నిరసన చేపట్టారు. 58 జీవోను సవరించి, మూడు నెలల రెన్యువల్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేయాలి

లక్సెట్టిపేట, నవంబర్ 3 : నూతనంగా ఎన్నికైన కార్యవర్గం జిల్లాలోని ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషిచేయాలని ఆర్యవైశ్య మహాసభల రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని వైశ్య భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య మహాసభల జిల్లా కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి చిలువేరు వైకుంఠం, మహిళా సంఘం అధ్యక్షురాలు నాగిశెట్టి జ్యోతి, ప్రధాన కార్యదర్శి నరేందుల సాహితి, యువజన సంఘం అధ్యక్షుడు బాల సంతోష్, ప్రధాన కార్యదర్శి బొద్దుకూరి రాజ్‌కుమార్‌తో పాటు నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, ముక్త శ్రీనివాస్, గణేశ్‌గుప్త, రేణికుంట్ల శ్రీనివాస్, ఉప్పల శారద, రాధ, చిదానందకుమారి, గుండ వీరేంద్రదాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో కొనసాగుతున్న విచారణ

బెల్లంపల్లి, అక్టోబర్ 30 : బెల్లంపల్లి పట్టణ శివారు శివాలయం పక్కన గల కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థులతో వంట పనులు చేయించిన ఘటనపై విచారణ కొనసాగుతున్నది. ఈ సంఘటనపై రెండు రోజుల కితం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు విచారణ చేపట్టారు. విద్యార్థులు, సిబ్బందిని వేర్వేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న అధికారిని ప్రశ్నించారు. రోజూ ఒక తరగతి చొప్పున విద్యార్థులకు టిఫిన్ చేసే పనిని అప్పగించారని, భోజన సమయంలో కూడా వంట మాస్టర్లకు సహాయకులుగా వ్యవహరిస్తున్నామని విద్యార్థులు తెలిపారు. మరో రెండు రోజుల్లో గురుకుల పాఠశాల జోనల్ అధికారి అరుణ కుమారి పాఠశాలలో సమగ్ర విచారణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందించి, తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
మంచిర్యాల శాఖ
చిరునామా: వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా, మార్కెట్ రోడ్, మంచిర్యాల-504208.
ఇ-మెయిల్: ubin0803634@unionbankofindia.bank

Ref: UBI/MNCH/344/24-25 తేది: 30-10-2024

SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద డ్రాఫ్ట్ డిమాండ్ నోటీసు

దిగువ వారికి:

1. మెసర్స్ శాలివాహన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ & సివిల్ వర్క్, యజమాని: శ్రీ తౌటు కేదారీశ్వర్, ఇం.నెం. 6-549, చున్ని రాం స్ట్రీట్, మార్కెట్ రోడ్, మంచిర్యాల-504208. **2. యజమాని: శ్రీ తౌటు కేదారీశ్వర్,** ఇం.నెం.6-549, స్టేషన్ రోడ్, మార్కెట్ రోడ్, మంచిర్యాల-504208. **హామీదారులు: శ్రీమతి తౌటు సంధ్య భర్త శ్రీ తౌటు కేదారీశ్వర్,** ఇం.నెం.6-549, స్టేషన్ రోడ్, మార్కెట్ రోడ్, మంచిర్యాల-504208.

సర్/మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(3)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద నోటీసు.

ఇందులో చిరునామాదారు నం.1 అయిన మీరు మా **మంచిర్యాల మెయిన్ శాఖ** నుండి దిగువ తెలిపిన రుణ సదుపాయాలు వినియోగించుకున్నారు మరియు బకాయి/వాయిదా/వడ్డీ చెల్లింపులో విఫలమైనందున మరియు ఖాతాల నిర్వహణ సంతృప్తికరంగా లేనందున ఇన్‌కం రికగ్నిషన్ మరియు ప్రూడెన్షియల్ అకౌంటింగ్ నియమాలకు అనుగుణంగా RBI మార్గదర్శకాల ప్రకారం మీ ఖాతా **06-10-2024** నాటికి నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడింది. మీ ఖాతాలలో బకాయి 28-10-2024 నాటికి **రూ. 25,07,643.10/- (ఇరవై ఐదు లక్షల ఏడు వేల ఆరు వందల నలభై మూడు రూపాయల పది పైసలు మాత్రమే)**

పైన తెలిపిన ఖాతాలో నెం.1 అయిన మీ నుండి బ్యాంక్‌కు గల బకాయి మొత్తం వివరాల దిగువ ఇవ్వబడినవి.

వసతి రకం	NPA తేదీ నాటికి అనగా 28-10-2024 నాటికి బకాయి మొత్తం	వర్తించని వడ్డీ 28-10-2024 నుండి	అపరాధ వడ్డీ (సింపుల్)	బ్యాంక్ ద్వారా భరించబడిన వ్యయం/ఛార్జీలు	మొత్తం బకాయి
ఓవర్‌డ్రాఫ్ట్ లోన్ 036331100000344	24,90,697.10	16,946.00	0	0	రూ. 25,07,643.10
మొత్తం పెండింగ్					రూ. 25,07,643.10

మెసర్స్ శాలివాహన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ & సివిల్ వర్క్, యజమాని శ్రీ తౌటు కేదారీశ్వర్ నుండి బ్యాంక్‌కు బకాయి అయిన నగదు లేదా నగదు బకాయి తిరిగి చెల్లింపు సెక్యూర్ చేయుటకు 06-06-2016న డాక్యుమెంట్లు ఎగ్జిక్యూట్ చేసారు మరియు దిగువ వివరించిన స్థిరాస్తి తనఖా విధానం ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పించబడినది.

స్థిరాస్తి వివరణ

శ్రీమతి తౌటు సంధ్య భర్త శ్రీ తౌటు కేదారీశ్వర్‌కు చెందిన, సబ్-రిజిస్ట్రార్ మంచిర్యాల జిల్లా అధికార పరిధిలో, మంచిర్యాల మున్సిపాలిటి రెవెన్యూ మండలం మంచిర్యాల పరిధి-మంచిర్యాల వద్ద గల, 161.71 చ.గజాలు విస్తీర్ణం, మార్కెట్ రోడ్, ఇం.నెం.6-549, చున్ని రాం స్ట్రీట్, మార్కెట్‌రోడ్, మంచిర్యాల వద్ద గల రెండు అంతస్తుల ఆర్‌సిసి రెసిడెన్షియల్ బిల్డింగ్ యావత్తు, **సరిహద్దులు:** తూర్పు: 30'.0'' వెడల్పు మున్సిపల్ రోడ్, పడమర: భుత్తపెల్లి ఖాళీ ప్రదేశం, ఉత్తరం: వాకులాబరణం లీలాదేవీ ఇం.నెం.6-550 మరియు అవతార్ మెహర్ బాబా ఓల్డ్ ఏజ్ హోమ్ ఇం.నం.6-551, దక్షిణం: జిల్లా పద్మావతి ఇం.నెం.6-547.

యజమాని పేరు: **శ్రీమతి తౌటు సంధ్య భర్త శ్రీ తౌటు కేదారీశ్వర్**

డాక్యుమెంట్ నెం.: డీడ్ నెం.2094/2009

ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా మీ పూర్తి రుణ బకాయిలను చెల్లించాల్సిందిగా మరియు మీ ద్వారా ఎగ్జిక్యూట్ చేయబడిన రుణ డాక్యుమెంట్ల నియమ నిబంధనల ప్రకారం కాంట్రాక్చువల్ రేట్ వంతున తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో పాటుగా **రూ.25,07,643.10/- (ఇరవై ఐదు లక్షల ఏడు వేల ఆరు వందల నలభై మూడు రూపాయల పది పైసలు మాత్రమే)**ల మొత్తాన్ని చెల్లించాల్సిందిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం మిమ్మల్ని కోరడం జరిగింది. విఫలమైనచో సదరు చట్టం క్రింద ఇవ్వబడిన ఏదేని లేదా అన్ని హక్కుల్ని ఉపయోగించడం ద్వారా పైన తెలిపిన సెక్యూరిటీల అమలుకు మేము కట్టుబడి ఉన్నాము.

చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారం ఈ నోటీసు స్వీకరణ తరువాత బ్యాంక్ యొక్క అనుమతి లేకుండా పై సెక్యూరిటీలను విక్రయించుట లేదా వాటితో లావాదేవీ నిర్వహించుట నుండి మీరు నిరోధించబడుతున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి SARFAESIలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(8) నిబంధనలు గమనించవల్సిందిగా మిమ్మల్ని కోరడమైనది.

అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రదేశం: మంచిర్యాల

హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ తనిఖీ

హాజీపూర్, నవంబర్ 4 : హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సాయంత్రం మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ వార్షిక తనిఖీ చేశారు. ఆయనతో పాటు, ఏసీపీ ప్రకాశ్‌కు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్ఐ గోపతి సురేశ్ పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, కానిస్టేబుళ్లతో మాట్లాడారు. పలు రికార్డులను పరిశీలించి, స్టేషన్ భౌగోళిక పరిస్థితులు, స్టేషన్ పరిధిలోని గ్రామాలు, నేర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం స్టేసన్ పరిసరాలను పర్యవేక్షించి స్టేషన్ ఆవరణ పచ్చదనంతో వెల్లివిరిసేలా చూడాలన్నారు.

బీఆర్ఎస్ యూత్ కమిటీ

కౌటాల, నవంబర్ 4 : మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాశిపాక రాజు ఆధ్వర్యంలో పార్టీ కౌటాల యూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్లపల్లి కార్తిక్, ఉపాధ్యక్షుడిగా జాడి బాజీ రావు, కార్యదర్శిగా కామ్రె గణేశ్, ట్రెజరరీగా దిలీప్, గోపాల్‌ను ఓటింగ్ విధానంలో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. నూతనంగా ఏర్పడిన కమిటీ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నది.

వాలీబాల్ టోర్నీ విజేత ఎసన్వాయి

కోటపల్లి, నవంబర్ 4 : దీపావళి సందర్భంగా కోటపల్లి మండలం ఎసన్వాయిలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీలో ఆతిథ్య ఎసన్వాయి జట్టు విజయం సాధించింది. ఫైనల్‌లో మల్లంపేటపై గెలుపొందగా, రూ.15వేలు, ద్వితీయ జట్టుకు రూ.7వేలు, తృతీయ స్థానంలో నిలిచిన చెన్నూర్ జట్టుకు రూ.3వేలు, జ్ఞాపికలు అందచేశారు. హెచ్ఎం కాసర్ల ప్రకాశ్, కార్యదర్శి తాజుద్దీన్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రూ.30 వేలకు టోకరా

పెంచికల్‌పేట్, నవంబర్ 2 : ఒడ్డుగూడకు చెందిన రౌతు సుజన్, జావారి అన్వేష్‌కు గురుకుల సీటు ఇప్పిస్తానని చెప్పి చేడువాయి గ్రామానికి చెందిన బుజాడి వెంకటేశ్ రూ.15వేల చొప్పున తీసుకొని మోసం చేశాడని పోలీసులు తెలిపారు. సీట్ల కోసం డబ్బు తీసుకొని ఆరు నెలల నుంచి తప్పుకుంటున్నాడని, సుజన్ సోదరుడు శంకర్, అన్వేష్ తండ్రి జావారి సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ కొమురయ్యను వివరణ కోరగా, ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఐరన్ ఆర్చ్ ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్, నవంబర్ 4 : కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ఐరన్ ఆర్చ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్‌తో పాలకవర్గం సభ్యులు సమావేశమై, పలు సమస్యలపై చర్చించారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడం సరికాదని, అనవసరంగా ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని, ఎత్తైన లోడు లారీలు పట్టణంలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ కొనేరు కృష్ణారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగిర్, కౌన్సిలర్లు సునీల్, జయచందర్, వలీ తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల ఉచ్చుకు తగిలి రైతు మృతి

చెన్నూర్ రూరల్, నవంబర్ 4 : అడవి పందుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు అమర్చిన తీగలు తగిలి విద్యుత్ షాక్‌తో రచ్చపల్లి గ్రామానికి చెందిన జాడి బాపు (45) మృతి చెందాడు. చెన్నూర్ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్తరావుపల్లికి చెందిన కొప్పుల శ్రీనివాస్ రచ్చపల్లిలోని పొలాన్ని అడవి పందుల నుంచి కాపడుకునేందుకు చుట్టూ విద్యుత్ తీగలు అమర్చాడు. ఆదివారం సాయంత్రం పొలం పనుల నిమిత్తం జాడి బాపు అటు వైపు వెళ్లాడు. విద్యుత్ తీగలకు తగిలి బాపు అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం వరకు వెతికారు. సోమవారం ఉదయం పొలం వైపు వెతుకుతుండగా కరెంట్ తీగలకు తగిలి మృతి చెంది కనిపించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ రవీందర్, ఎస్ఐ సుబ్బారావు, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ సంఘనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి భార్య తిరుపతమ్మతో పాటు, ఇద్దరు కొడుకులున్నారు. తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తీగలు అమర్చిన కొప్పుల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆయిల్ పామ్ తోటల సందర్శన

చింతలమానేపల్లి, నవంబర్ 4 : మండలంలోని గంగాపూర్‌లో గల ఆయిల్ పామ్ తోటలను సోమవారం ఉద్యానవన అధికారి సుప్రజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్, ఫీల్డ్ అధికారి రమేశ్, సచిన్, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి కొనుగోలు చేయాలి

నస్పూర్, నవంబర్ 4 : రైతుల నుంచి నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జీవో నంబర్ 27 ద్వారా 33 రకాల ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ వర్తిస్తుందని, సన్న, దొడ్డు రకం వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఏవో కల్పన, సహకరశాఖ అధికారి సంజీవరెడ్డి, మార్కెటింగ్ అధికారి షాబద్దీన్, పౌరసరఫరాల మేనేజర్ శ్రీకళ పాల్గొన్నారు.

జపాన్ కార్యక్రమానికి విద్యార్థి ఎంపిక..

భారత ప్రభుత్వం, సెక్రటరీ ఆఫ్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో జపాన్‌లో నిర్వహించే సకురా సైన్స్ ఎక్స్చేంజ్ కార్యక్రమానికి మంచిర్యాల కేజీబీవీ విద్యార్థిని విద్యాసింగ్ ఎంపికవడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థిని ప్రయాణ ఖర్చులు, వసతి సౌకర్యాలు ప్రభుత్వం చూసుకుంటుందని, సొంత ఖర్చులకు సాదుల ప్రవీణ్‌కుమార్-వనజ దంపతులు రూ.5 వేలు, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు రూ.2 వేలు, కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వప్న రూ.2వేలు అందించినట్లు పేర్కొన్నారు.

గోయగాం చేరిన పాదయాత్ర

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్/కెరమెరి, నవంబర్ 4 : పండర్‌పూర్ దైవదర్శణానికి ఆసిఫాబాద్ ఎక్స్‌రోడ్డు నుంచి ప్రారంభమైన పాదయాత్ర సోమవారం గోయగాం చేరుకున్నది. ఈ పాదయయాత్రను జిల్లా కేంద్రంలోని బాలాజీ మహారాజ్ ఆలయం వద్ద సమితి ప్రముఖులు జెండా యూపి ప్రారంభించారు. యేటా కార్తీకమాసంలో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీ. స్థానిక భక్తులు ఆహ్వానం పలికారు. రాత్రి అక్కడే ఉండేందుకు సౌకర్యాలు కల్పించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడే తుకారాం మహారాజ్, ప్రముఖులు రామ్ చందర్, బాలాజీ, రవీందర్, రమేశ్, తులసీరాం, వెంకట్‌రావ్ పటేల్, సుదర్శన్ మహారాజ్, భక్తులున్నారు

సమస్యల పరిష్కారానికే పొలం బాట

వేమనపల్లి, నవంబర్ 4 : రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ తెలిపారు. మండలంలోని జిల్లెడ గ్రామ శివారులోని రైతుల పంట పొలాల్లో సోమవారం పొలంబాట నిర్వహించారు. రైతులు తమ వ్యవసాయ బోరు మోటార్ల వద్ద నాణ్యమైన విద్యుత్ తీగలను ఉపయోగించాలని, కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. పొలాల్లో వంగిన స్తంభాలను సరిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ ఆకాశ్, లైన్‌మన్ మార్కండేయ, అసిస్టెంట్ లైన్‌మన్ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.